



మండలాల బూత్ కమిటీల సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

# చెయ్యి గుర్తుకు ఓటేస్తే టార్చ్ లైట్ కొనాల్సిందే

- కరెంటుపై రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు
- సూక్ష్మ ప్రణాళికతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం
- బీఆర్ఎస్ కార్యకర్తలు వారియర్స్‌లా పని చేయాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- షానగర్‌లో రామడుగు, చొప్పదండి మండలాల బూత్ కమిటీల సమావేశానికి ఎమ్మెల్యే సుంకెతో కలిసి హాజరు

చొప్పదండి, నవంబర్ 13 : రానున్న ఎన్నికల్లో చెయ్యి గుర్తుకు ఓటేస్తే మోసపోతామని, మళ్లీ టార్చ్ లైట్ కొనుక్కునే దుస్థితి వచ్చి గోసపడతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హెచ్చరించారు. సోమవారం రామడుగు మండలంలోని షానగర్ లక్ష్మీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ఏర్పాటు చేసిన చొప్పదండి, రామడుగు మండలాలకు చెందిన బూత్ కమిటీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి ఎన్నికలు జరుగుతున్నాయని, తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రణాళిక రూపొందించారని తెలిపారు. పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ఈ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ రావాలని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా విధంగా బూత్ కమిటీ సభ్యులు, 100 ఓటర్ల ఇన్‌చార్జిలు ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గతంలో 7778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఉంటే దానిని 26 వేల మెగావాట్ల ఉత్పత్తికి పెంచామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరినదిపై ఒకే ఒక్క ఎస్సారెస్పీ ప్రాజెక్టు మాత్రమే ఉందని, రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎల్లంపల్లి, సుందిళ్ల, మేడిగడ్డ అన్నారం, తుపాకులగూడెం, తుమ్మగూడం ఇలా ఆరు ప్రాజెక్టులు నిర్మించుకున్నామని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని చెప్పారు. 'కేసీఆర్ బీమా ఇంటికి ధీమా, ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, ఆసరా పెన్షన్లు, ఆరోగ్యలక్ష్మి పెంపుపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. 100 ఓటర్ల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు వారియర్స్‌లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ నాయకులు మళ్లీ తెలంగాణలో చిచ్చు పెట్టేందుకు వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. 'టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలని మాట్లాడుతున్నడు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవచ్చని అంటున్నడు. మామూలుగా రైతులందరూ 3, 5 హెచ్‌పీ మాత్రమే వాడుతరు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఇవే వాడుతున్నరు. 10 హెచ్‌పీ కొనుగోలు చేయాలంటే రైతులకు అధిక ఖర్చుతో కూడుకున్న పని. ఈ మాత్రం అవగాహన రేవంత్‌రెడ్డికి లేదు' అని ఎద్దేవా చేశారు. మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు పట్టించుకోరని చెప్పారు. గతంలో కర్ఫ్యూ, దోపిడీ, దొంగతనాలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇప్పటి యువకులకు అవేంటో తెలియకుండా చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, ఎంపీపీలు చిలుక రవీందర్, కలిగేటి కవిత– లక్ష్మణ్, జడ్పీటీసీలు మాచర్ల సౌజన్య–వినయ్, మార్కొండ లక్ష్మి –కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ–భూమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, మామిడి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న



బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న. రూ.1800 కోట్లతో పనులు చేసి చూపిస్తున్న. నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన ఇంటింటికీ వెళ్లి 100 ఓట్ల ఇన్‌చార్జ్‌లు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి. కార్యకర్తలు లేకపోతే నేను లేను. కార్యకర్తలే నా బలం నా బలగం. ఈ నెల 17న గంగాధరలో సీఎం కేసీఆర్ సభ ఉంటుంది. నియోజకవర్గంలోని ప్రజలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలి.

**- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

# ముదిరాజ్‌లకు అండగా ఉంటా

**ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి**



ఉప్పల్‌లో కౌశిక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ముదిరాజ్ కులస్తులు

కమలాపూర్, నవంబర్ 13: ముదిరాజ్ కులస్థులకు అండగా ఉంటానని మండలి విప్, బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి రఘుతోపాటు 200 మందికి పైగా కులస్థులు బీఆర్ఎస్‌లో చేరగా, ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డికి ముదిరాజ్ కులస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ ఉచితంగా చేప పిల్లలను అందజేస్తున్నట్లు తెలిపారు. పెద్దమ్మ గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టారని, రైతులకు 24గ గంటల కరెంటు, రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్ల పెంపు వంటివి తీసుకు వచ్చిన విషయం అందరి కండ్ల ముందు ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ బీమా..ఇంటింటికీ ధీమా పథకంలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచ్ దేవేందర్‌రావు, ఎంపీటీసీలు సంపత్‌రావు, తుర్పాటి అరుణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జక్కుల రాజు, నాయకులు నాయినేని తిరుపతిరావు, వాణీరావు, నవీన్‌కుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.



చింతకుంటలో ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

## యాభై ఏళ్ల దరిద్రమా..?

# పదేళ్ల అభివృద్ధా..?

- ఏది కావాలో ప్రజలో ఆలోచించాలి
- అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 13 : పదేళ్ల కాలంగా జరుగుతున్న అభివృద్ధి కొనసాగడంతో పాటు మరింత అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఖచ్చితంగా రావాలని బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని చెప్పారు. సమైక్యపాలనలో ఆంధ్రోళ్లే ముఖ్యమంత్రులుగా ఉండేవారని, ఇక్కడి నిధులను దోచుకొని ఆంధ్రప్రాంతాన్ని అభివృద్ధి చేసి తెలంగాణకు పైసా నిధులు ఇవ్వక అరిగోస పెట్టారని తెలిపారు. గోదావరి ఈ ప్రాంతం నుంచి వెళ్లినా ఒక్క చుక్క నీరు రాకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. వానకాలంలో కూడా ఎల్ఎండీ ఎడారిని తలపించేదని, సాగు, తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డ రోజులు రైతులు ఇంకా మరిచిపోలేదన్నారు. సరిపడా కరెంట్ లేక రైతులు పొలాల వద్దే రాత్రిళ్లు పడిగాపులు కాసిన రోజులు ఎలా ఉండేవో గుర్తుంచుకోవాలన్నారు. స్వయంపాలనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన నిధులతో గొప్పగా అభివృద్ధి చేశామన్నారు. 1956లో మన తాతల చేసిన తప్పుతో పచ్చగా ఉన్న తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో కలిపారని, ఇప్పుడు పచ్చగా ఉన్న తెలంగాణను చూసి ఆంధ్రోళ్లకు మళ్లీ కళ్ళమంట మొదలై దోచుకొనే కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. బీజేపీ పేరుతో కిరణ్‌కుమార్‌రెడ్డి వస్తే.. పవన్‌కల్యాణ్‌తో చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, షర్మిల, కేవీపీ కాంగ్రెస్ ముసుగులో హైదరాబాదులో అడ్డావేయడం ఇందులో భాగమేనని, ప్రజలు ఈ విషయాలను గుర్తుంచుకొని ఓట్లు వేయాలని కోరారు. ఒక తప్పు జరిగితే మళ్లీ నలభై, యాభై ఏళ్ల దరిద్రం చూస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే అధికారం ఢిల్లీలో ఉంటుందని, అదే బీఆర్ఎస్‌కు ఓటేస్తే మనచేతుల్లోనే ఉంటుందన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఎప్పుడైనా మీ ఊరికి వచ్చాడా ? అని ప్రశ్నించారు. తాను మీ కళ్ళ ముందు పెరిగిన బిడ్డనని, మరోసారి ఆశీర్వదిస్తే గొప్పగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, సర్పంచ్ మొగిళి మంజుల సమ్మయ్య, ఎంపీటీసీలు పట్టెం శారదలక్ష్మి నారాయణ, తిరుపతినాయక్, నాయకులు జయ ప్రకాశ్‌రెడ్డి, పిల్లి మహేశ్, కాసారపు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

# కవ్వంపల్లికి స్వగ్రామంలో షాక్

- కాంగ్రెస్‌కు బైబై.. బీఆర్ఎస్‌కు జై
- ఎమ్మెల్యే రసమయి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన 200 మంది కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్, నవంబర్ 13 : కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణకు భారీషాక్ తగిలింది. ఆయన స్వగ్రామమైన మానకొండూర్ మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీకి బైబై చెప్పి.. బీఆర్ఎస్‌కు జైకొట్టారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షుడు కన్నం శ్రీధర్, ఉపసర్పంచ్ దాసరి వేణు గోపాల్‌రెడ్డితోపాటు 200 మంది నాయకులు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి రసమయి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ నర్మెట వసంత–వీరయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామంచ ప్రవీణ్, నాయకులు నెల్లి మురళి, మల్లగల్ల నగేశ్, పిట్టల శ్రీనివాస్, కొమురయ్య, దాసరి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.